

తాండూరు రూరల్: గౌతాపూర్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులతో కలిసి బ్రేక్‌ఫాస్ట్ చేస్తున్న ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి



పూడూరు: మన్నెగూడ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు అల్పాహారం వడ్డిస్తున్న ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి



కొడంగల్: కొడంగల్ పట్టణంలోని జీసీపీఎస్ పాఠశాలలో అల్పాహారం తింటున్న విద్యార్థులు

# విద్యార్థుల ఆరోగ్యం కోసమే అల్పాహారం..

- పథకాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యేలు పంజుగుల రోహిత్‌రెడ్డి, కొప్పుల మహేశ్‌రెడ్డి
- పాల్గొన్న డీఈవో రేణుకాదేవి, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ రాజూగౌడ్ తదితరులు

తాండూరు రూరల్, అక్టోబర్ 6 : విద్యార్థి భవిష్యత్తు బాగుంటేనే దేశ భవిష్యత్తు బాగుంటుందనే ఉద్దేశ్యంతో సీఎం కేసీఆర్ రాష్ట్రంలో విద్యార్థుల కోసం బ్రేక్‌ఫాస్ట్ పథకానికి శ్రీకారం చుట్టారని తాండూరు ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం తాండూరు మండలం, గౌతాపూర్ ప్రాథమిక పాఠశాలలో ఎమ్మెల్యే ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాభివృద్ధికి సీఎం కేసీఆర్ ఎనలేని కృషి చేస్తున్నారన్నారు. ప్రభుత్వ బడుల్లో చదువుకునే విద్యార్థులందరికీ ఉచిత భోజనం, పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, ఏక రూప దుస్తులు అందిస్తున్నట్లు గుర్తు చేశారు. ఉదయం పూట విద్యార్థులు ఖాళీ కడుపుతో పాఠశాలకు వస్తున్నారని, దీని కారణంగా విద్యార్థుల్లో ఎదుగుదల, మానసిక స్థితిలో మార్పులు వస్తున్నాయని తెలిపారు. విద్యార్థి శారీరకంగా, మానసికంగా ఎదగాలనే ఉద్దేశంతో పాఠశాలల్లో బ్రేక్‌ఫాస్ట్ పథకానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. కేజీ టూ పీజీ ఉచిత విద్యను అందించాలనే లక్ష్యంతో రాష్ట్రంలో అనేక గురుకుల పాఠశాలలను ప్రారంభించారని గుర్తు చేశారు. గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ రాజుగౌడ్ మాట్లాడుతూ బ్రేక్‌ఫాస్ట్ కార్యక్రమంతో పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతం పెరుగుతుం దన్నారు. డీఈవో రేణుకాదేవి మాట్లాడుతూ జిల్లాలో నాలుగు నియోజకర్గాల్లో బ్రేక్‌ఫాస్ట్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని తెలిపారు. దసరా తర్వాత అన్ని పాఠశా లలకు విస్తరించేలా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అనితాగౌడ్, జడ్పీటీసీ గౌడి మంజుల, వైస్ ఎంపీపీ స్వరూప, సర్పంచ్ రాజప్ప, ఎంపీటీసీ నరేం దర్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ దీప, ఎంఈవో వెంకటయ్యగౌడ్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రాందాస్ ముదిరాజ్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు

**పూడూరు:** మన్నెగూడ ప్రాథమిక పాఠశాలలో అల్పాహారం పథకాన్ని పరిగి ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకునేలా వారికి అన్ని వసతులు ముఖ్యమంత్రి కల్పిస్తున్నారని ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ మేఘమాల, సర్పంచ్ వినోద్‌గౌడ్, ఆర్డీవో విజయ కుమారి, ఎంపీడీవో ఉమాదేవి, ఎంఈవో హరిశ్చందర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, పరిగి మార్కెట్ కమిటీ చైర్మన్ ఎండి.అజారొద్దీన్, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు అనంతరెడ్డి, మైనార్టీ నాయకుడు సయ్యద్ అధిల్, హెచ్‌ఎంలు రత్న, సుజాత, మహేందర్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

**కొడంగల్:** పట్టణంలోని జీసీపీఎస్ పాఠశాలలో అల్పాహారం పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పాల్గొన్న అధికారులు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఎన్నో సదుపాయాలు అందుబాటులోకి వచ్చినట్లు తెలిపారు. ఒక్కో విద్యార్థికి ప్రభుత్వం రూ.2500ల ఖర్చుతో ఉచితంగానోటు, పాఠ్య పుస్తకాలను, 10వ తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను అందిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా రెండు జతల స్కూల్ యూనిఫాం, మధ్యాహ్న భోజన పథకంతో పౌష్టికాహారంతో కూడిన భోజనాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. కాగా మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో 250 ప్లేట్లతో పాటు గ్లాస్‌లు, స్పూన్‌లను కమిషనర్ ప్రవీణ్ కుమార్‌రెడ్డి అదజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ ఉషారాణి, అకాడమీ మానిటరింగ్ అధికారి రామ్, ఎంఈవో రాంరెడ్డి, బీఆర్ఎస్ పట్టణ అధ్య క్షుడు రమేశ్‌బాబు, సీడీపీవో జయరాం, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాములు, రిసోర్స్ పర్సన్ వీరేశంతో పాటు ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, మెప్మా, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# శాస్త్రీయ పద్ధతిలో రైతులు పత్తి సాగు చేయాలి



పత్తి పంటను పరిశీలిస్తున్న ఏరువాక కేంద్రం శాస్త్ర వేత్తలు

పూడూరు, అక్టోబర్ 6 : శాస్త్రీయ పద్ధతుల ద్వారా రైతులు పత్తి పంట సాగు చేస్తే అధిక దిగుబడి సాధిస్తారని ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త కో ఆర్డినేటర్ టి.లక్ష్మణ్ పేర్కొన్నారు. శుక్రవారం పూడూరు మండల పరిధిలోని కంకల్, చింతల్‌పల్లి, మేడిపల్లి, పూడూరు, మాదారం గ్రామాలల్లో ప్రొఫెసర్ జయ శంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ఏరువాక కేంద్రం, తాండూరు శాస్త్రవేత్తలు, కేంద్రం పత్తి పరిశోధన స్థాన ప్రత్యేక శాస్త్రవేత్తల బృందం కలిసి పలు పత్తి సాగు పంటలను పరిశీలించారు. అనంతరం ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త కో ఆర్డినేటర్ లక్ష్మణ్ మాట్లాడుతూ రైతులు పంట సకాలంలో సాగుచేస్తే ఒకేసారి పంట కోతకు వస్తుందని తెలిపారు. పండిన పత్తి పంటను ఒకేసారి తీస్తే వెంటనే మరో పంట సాగు చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. ప్రస్తుత తరుణంలో చీడపీడ నివారణకు తగిన యజమాన్య పద్ధతులు చేపట్టాల్సిందిగా శాస్త్రవేత్తల బృందం రైతులకు సూచించింది. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు సి.యమున, డాక్టర్ గుర్జార్, భాను, బి.వెంకటేశ్, మధు, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

# చెరుకు పంట దగ్ధం

పెద్దేముల్, అక్టోబర్ 6 : ఆరున్నర ఎకరాల చెరుకు పంట మంటల్లో దగ్ధమైన ఘటన శుక్రవారం పెద్దేముల్ పోలీసు స్టేషన్ పరిధిలోని అడికిచెర్ల గ్రామంలో చోటు చేసుకుంది. బాధితరైతులు తెలిపిన వివరాల ప్రకారం...అడికిచెర్ల గ్రామానికి చెందిన అశ్విన్‌రెడ్డికి చెందిన ఐదు ఎకరాల పొలాన్ని రాంసింగ్ గ్రామానికి చెందిన గంగారాం కౌలుకు తీసుకొని మూడు ఎకరాల్లో చెరుకు పంటను సాగు చేస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన రాంరెడ్డి రెండు ఎకరాలు , మొల్ల ఇమామ్ ఎకరాన్నర భూమిలో చెరుకు పంటను పండిస్తున్నారు. గురువారం సాయంత్రం అదే పొలాల సమీపంలో విద్యుత్ జంపర్ వైర్లు కలువడం ద్వారా మంటలు చెరుకు పంటపై పడగా ఆరున్నర ఎకరాల చెరుకు పంట పూర్తిగా అగ్నికి ఆహుతైంది. దీంతో బాధిత రైతులు కన్నీరుమున్నీరయ్యారు. సుమారు రూ.ఐదు లక్షల వరకు నష్టం వాటిల్లిందని తెలిపారు. తమను ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతులు గంగారాం, రాంరెడ్డి, మొల్ల ఇమామ్ ప్రభుత్వాన్ని వేడుకున్నారు.

# క్రీడా పోటీల్లో సత్తా చాటిన కొడంగల్ విద్యార్థులు



సాధించిన బహుమతులతో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు

కొడంగల్, అక్టోబర్ 6: పట్టణానికి చెందిన మహాత్మాజ్యోతీబాపూలే గురుకుల పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయి క్రీడల్లో పాటీ పడి సత్తాను చాటినట్లు కళాశాల ప్రిన్సిపాల్ నారాయణరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా పరిధిలో జరిగిన క్రీడల్లో కొడంగల్ గురుకుల విద్యార్థులు కబడ్డీ, పరుగుపందెం, హైజంప్, లాంగ్‌జంప్, ఖోఖో, చదరంగం, క్యారమ్స్, షాట్‌పుట్, డిస్కత్రో, పోటీల్లో ప్రథమ బహుమతిని సాధించినట్లు తెలిపారు. అలాగే టోటల్ ఛాంపియన్ షిప్‌ను సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాలలో ప్రత్యేకంగా సమావేశాన్ని ఏర్పాటు చేసి కళాశాలకు పేరు ప్రఖ్యాతులు సాధించి పెట్టిన విద్యార్థులను అభినందించి ఆశీర్వదించినట్లు తెలిపారు. భవిష్యత్తులో కూడా క్రీడల్లో రాణించి జాతీయ స్థాయిలో స్థానం సంపాదించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సంధ్య, అనంతరాములు, సురేశ్, నెహ్రూనాయక్ తదితరులు పాల్గొన్నారు.

# చెప్పిన దాని కంటే ఎక్కువే చేశాం

## వికారాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్



లబ్ధిదారులకు ఇండ్ల పట్టాలను అందజేస్తున్న ఎమ్మెల్యే మెతుకు ఆనంద్

కోట్‌పల్లి, అక్టోబర్ 6: గత ఎన్నికల్లో ఇచ్చిన హామీల కంటే కూడా ఎక్కువ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేసినట్లు వికారాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ అన్నారు. శుక్రవారం కోట్‌పల్లి మండలంలోని కరీంపూర్ గ్రామంలో నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులకు ఇండ్ల పట్టాలు, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. అదే విధంగా బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. గత ప్రభుత్వాలు 60 ఏండ్ల పాలనలో ఏమీ అభివృద్ధి చేయలేదని, తొమ్మిదేండ్ల పాలనలో అరవై ఏండ్లల్లో చేయని అభివృద్ధిని చేసిన ఘనత సీఎం కేసీఆర్ సర్కార్‌ది అన్నారు. ఏ ప్రభుత్వం ఏం చేసిందో ప్రజలకు అన్నీ తెలుసన్నారు. 47 మంది ఆడ బిడ్డల వివాహాలకు సంబంధించిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. కరీంపూర్, ఎన్కెపల్లి, బార్వాద్, కొత్తపల్లి గ్రామాలకు సంబంధించి 550 మంది లబ్దిదారులకు ఇండ్ల పట్టాలను పంపిణీ చేశారు. కరీంపూర్ గ్రామంలో రూ. 45 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు, రూ. 20 లక్షల నిధులతో నిర్మించనున్న గ్రామ పంచాయతీ భవనానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, వైస్ ఎంపీపీ ఉమాదేవీ, పార్టీ మండల అధ్యక్షుడు అనిల్, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు వెంకటేశం, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# లైంగిక దాడి కేసులో నిందితుడి అరెస్టు.. రిమాండ్‌కు తరలింపు

కొడంగల్, అక్టోబర్ 6:చిన్ననందిగామ గ్రామంలో ఓ మానసిక దివ్యాంగురాలపై అదే గ్రామానికి చెందిన వ్యక్తి ఈనెల మూడో తేదీన లైంగికదాడికి పాల్పడినట్లు సీఐ రాములు తెలిపారు. బాధితురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేసినట్లు తెలిపారు. విచారణ అనంతరం కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.